క్లుప్తంగా

నిబంధనలు కచ్చితంగా పాటించాల్సిందే..

• ఆర్డీఓ సాయిశ్రీ



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్డీఓ సాయిశ్రీ

బొబ్బిలి: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కమిషన్ ఇస్తున్న సూచనలు, నిబంధనలను రాజకీయ పార్టీలన్నీ పాటించాలని ఆర్డీఓ ఎ.సాయిశ్రీ సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాల్లో సవరణలు, ఎన్నికల నిబంధనలపై పలు సూచనలు చేశారు. తహసీల్దార్ త్రినాథరావు నాయుడు, డీటీ రెడ్డి సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

• ట్రైనీ డీఎస్పీ మహేంద్ర



వాహనదారులతో మాట్లాడుతున్న ట్రైనీ డీఎస్పీ మహేంద్ర

వంగర: మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రైనీ డీఎస్పీ ఎస్.మహేంద్ర అన్నారు. మండలంలోని మద్దువలస, అరసాడ జంక్షన్ వద్ద మంగళవారం ట్రాఫిక్ రూల్స్‌పై వాహనదారులకు అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండని వారికి వాహనాలు నడిపేందుకు ఇవ్వొద్దని సూచించారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారితో పాటు వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, మద్యం సేవించి, అతి వేగంతో వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

100 మందికి వైద్య సేవలు



రోగులకు తనిఖీలు చేస్తున్న వైద్యశిబ్బంది

రేగిడి: మండలంలోని బాలకవివలస గ్రామంలో రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జీసీఎస్ఆర్ కళాశాల జాతీయ సేవా పథకం -1 పీఓ సీహెచ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యాధికారి యోగానందన్ సుమారు 100 మంది రోగులకు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో సర్పంచ్ వావిలపల్లి చంద్రశేఖర్, ఎంపీడీఓ బంకి హరనాథ్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ



రైతులకు పాసుపుస్తకాలు అందజేస్తున్న సర్పంచ్ గోవిందరావు

రేగిడి: మండలంలోని చాటాయివలస గ్రామ సచివాలయ పరిధిలో చాటాయివలస, ఉప్పర్నాయుడువలస గ్రామ రైతులకు కంప్యూటర్ పాస్ పుస్తకాలను మంగళవారం పంపిణీ చేశారు. రెవెన్యూ అధికారులు ఇటీవల గ్రామాల్లో భూ సర్వే చేపట్టారు. రైతులకు సంబంధించిన భూముల వివరాలతో కూడిన పాస్ పుస్తకాలను ప్రభుత్వం అందజేసిందని వీఆర్వోలు భారతి, సన్నెందొరలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం గోవిందరావు, రైతులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



వన్నలి పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న అధికారులు

రేగిడి: మండలంలోని వన్నలి, చాటాయివలస, ఉప్పర్నాయుడువలస, వండానపేట, గుళ్లపాడు తదితర పోలింగ్ బూత్‌లను సెక్టార్ ఆఫీసర్ అర్జున్, పోలీసు అధికారి వెంకటేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. పోలింగ్ బూత్‌లలో విద్యుత్ సౌకర్యం, తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంపులు తదితర సౌకర్యాలను పరిశీలించారు. వారితో పాటు బీఎల్ఓలు భారతి, సన్నెందొర తదితరులు ఉన్నారు.

ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం

బొబ్బిలి: మండలంలోని నారాయణప్పవలస, కాశిందొరవలస గ్రామాల్లో బొబ్బిలి ఇందిరాగాంధీ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్‌లు సేవా శిబిరాలు నిర్వహించాయి. ప్రిన్సిపాల్ బలగ అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, తడి పొడి చెత్త సేకరణ, మొక్కల పెంపకం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్లు పి.రామకృష్ణ, వై.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి చిరునామా వైఎస్సార్‌సీపీ

• ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు
• ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

బొబ్బిలి: సంక్షేమానికి చిరునామాగా వైఎస్సార్‌సీపీ అవతరించిందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని బొబ్బిలిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బలిజిపేట రోడ్డులో ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. జోహార్ వైఎస్సార్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం పార్టీ కార్యాలయానికి వెళ్లి అక్కడ పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, వైస్ చైర్మన్లు చెలికాని మురళీ కృష్ణారావు, రమాదేవి, రాష్ట్ర ఆర్థిక మండలి మాజీ సభ్యుడు తూముల భాస్కరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు బొడిగంజి రమేష్‌నాయుడు, ఎంపీపీ శంబంగి లక్ష్మి, జడ్పీటీసీ శాంతికుమారి, జేసీఎస్ ఇన్‌ఛార్జిలు రేజేటి ఈశ్వరరావు(విసు), తమ్మిరెడ్డి దామోదరరావు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



బొబ్బిలి: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత వైఎస్సార్‌సీపీదే..

రాజాం: మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందని పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మంచి చేయాలనే ఏకైక లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 13 ఏళ్ల క్రితం పార్టీని ఏర్పాటు చేశారని, ఎన్నో కష్టాలు, ఒడుదొడుకులు తట్టుకుంటూ సంపూర్ణ మెజార్టీతో ఐదేళ్ల క్రితం ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిందని గుర్తుచేశారు. ఈ ఐదేళ్లలో ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి పార్టీలో తగిన గుర్తింపు లభిస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రతీ కార్యకర్త కృషిచేయాలని కోరారు. అనంతరం మాధవబజార్ వద్ద ప్రధాన రహదారిపై వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మల్లికార్జునకాలనీలోని అనాథ వృద్ధాశ్రమంలో పేదలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, పార్టీ రాజాం పట్టణ, రూరల్ అధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, జేసీఎస్ కన్వీనర్ కామోదుల శ్రీనివాసరావు, డాక్టర్ నరేంద్ర, దూబ గోపాలం, శాసపు వేణుగోపాలనాయుడు, జేసీబీ శ్రీను, యందవ చినబాబు, కోరాడ రామినాయుడు, తోట తిరుమలరావు, పాలవల శ్యామ్, గోకవలస బాబూరావు, అల్లెన జయలక్ష్మి, కోల్ల రమ్య, యందవ సుశీల, ఆర్.జయరాం మాస్టారు, తదితరులు పాల్గొన్నారు.



రాజాం: వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్, తదితరులు

ఇళ్ల స్థలాల పంపిణీ చారిత్రాత్మకం

• డ్వాక్రా మహిళలను మోసం చేసిన ఘనుడు చంద్రబాబు
• సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి
• ఇళ్ల పట్టాల పంపిణీలో ఎమ్మెల్యే శంబంగి



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ చారిత్రాత్మకమని, 58 నెలలుగా పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యతనిస్తున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా కొండకెంగువ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషిచేస్తున్నారని అన్నారు. సంక్షేమ క్యాలెండర్‌ను విడుదల చేసి, అందులో పేర్కొన్న మేరకు పథకాలను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు.

మహిళలను మోసం చేసిన ఘనుడు చంద్రబాబు..

2014 ఎన్నికల్లో పొదుపు సంఘాల మహిళలు, రైతుల రుణాలను పూర్తిగా మాఫీ చేస్తానని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి హామీలు అమలు చేయకుండా మహిళలు, రైతులను మోసం చేసిన ఘనుడు చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రం మరో శ్రీలంకగా మారుతుందని విమర్శించిన చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే అవే పథకాలను రెట్టించి అందిస్తామని నాలుక మడతేసి చెప్పడాన్ని ప్రజలు నమ్మడం లేదన్నారు. అధికారంలోకి రావాలనే తపనతో జనసేన, బీజేపీలతో పొత్తు పెట్టుకుని ఎల్లో మీడియాతో కలిసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ఇష్టానుసారంగా చేస్తున్న విమర్శలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గంగలో కలపడం ఖాయమన్నారు. భవిష్యత్‌లో మరింత సంక్షేమం, అభివృద్ధిని సాధించుకునేందుకు మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, తహసీల్దార్ ఎ.సులోచనరాణి, ఎంపీడీఓ ఈశ్వరమ్మ, వైస్ ఎంపీపీలు బెల్లాన ప్రసాదరావు, పెంకి శేఖర్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయులు, పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మునాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం

రాజాం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని, ఈ విషయాన్ని ప్రజలంతా గుర్తించాలని వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ పరిశీలకుడు కె.వి.సూర్యనారాయణరావు(పులిరాజు), పార్టీ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. లచ్చయ్యపేట సచివాలయం పరిధిలోని కొండకవీధి, బుర్రావీధి, కొరగంజివీధి, కాలెపువీధుల్లో మంగళవారం ఇంటింట ప్రచారం చేశారు. ఈ ఐదేళ్లలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు.



కాలెపువీధిలో ప్రచారం చేస్తున్న పార్టీ పరిశీలకుడు సూర్యనారాయణరాజు, ఇన్‌చార్జ్ డాక్టర్ రాజేష్, తదితరులు

కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, నాయకులు పిచ్చుక శ్రీనివాసరావు, కాలెపు శేఖర్, చిన్న, సత్య, గణపతి, రమ్య, జయలక్ష్మి, ఈశ్వరరావు, యందవ సుశీల, తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వతో ప్రజల ఆస్తులకు రక్షణ

• ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: ప్రభుత్వం నూతన సాంకేతిక విధానాలతో ప్రజల ఆస్తులకు రక్షణ కల్పిస్తోందని ఎమెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. జగనన్న భూరక్ష, భూహక్కు కార్యక్రమంలో భాగంగా మండలంలోని జగన్నాథపురంలో ఇళ్లు, ఖాళీ స్థలాలపై హక్కు పత్రాలను మంగళవారం గ్రామస్తులకు పంపిణీ చేశారు. సర్పంచ్ బొద్దల పద్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ..పైలట్ ప్రాజెక్టు కింద మండలంలోని జగన్నాథపురంలో 873, గొర్లె సీతారాంపురంలో 549, జే రంగరాయపురంలో 349, కృష్ణాపురంలో 572 మందికి హక్కు పత్రాలు వచ్చినట్టు చెప్పారు. త్వరలో అన్ని గ్రామాల ప్రజలకు వీటిని పంపిణీ చేస్తారన్నారు. అనంతరం ఇటీవల గ్రామంలో నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే చేతులమీదుగా బహుమతులు అందజేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు శంబంగి వేణుగోపాలనాయుడు, ఎంపీపీ శంబంగి లక్ష్మి, జడ్పీటీసీ శాంతకుమారి, బొద్దల సత్యనా రాయణ, ఎంపీడీఓ పి.రవికుమార్, డీటీ అప్పన్న పాల్గొన్నారు.



స్వామిత్వ పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం తహసీల్దార్‌గా ప్రసన్నకుమార్



ప్రసన్నకుమార్

తెర్లాం: మండల తహసీల్దార్‌గా కె.ప్రసన్నకుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇటీవల తెర్లాం తహసీల్దార్‌గా నియమితులైన దిలీప్ చక్రవర్తిని కొద్ది రోజుల్లోనే మెంటాడ మండల తహసీల్దార్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో మెంటాడ తహల్దార్‌గా పనిచేసిన ప్రసన్నకుమార్‌ను తెర్లాంకు బదిలీ చేశారు.

16న జాతీయ లోక్‌అదాలత్

రాజాం సిటీ: ఈ నెల 16న నిర్వహించనున్న మెగా జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులంతా సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అదాలత్‌లో రాజీకి అనుకూలమైన సివిల్, క్రిమినల్, ప్రీలిటిగేషన్ కేసులన్నీ ఇరుపార్టీల అంగీకారంతోనే పరిష్కరించనున్నామని తెలిపారు. సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్టు ఫీజు వాపసు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

రామభద్రపురం: మండలంలోని జన్నివలస జంక్షన్ వద్ద మంగళవారం సాయంత్ర జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాలూరుకు చెందిన కొయ్యారపు రాకేష్, నల్లి రమేష్, షేక్ సూరజ్ ద్విచక్ర వాహనంపై రామభద్రపురం మీదుగా సాలూరు వెళుతున్నారు. జన్నివలస జంక్షన్ వద్దకు వెళ్లేసరికి సాలూరు వైపు నుంచి వస్తున్న వ్యాను ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. షేక్ సూరజ్‌కు తీవ్ర గాయాలు కాగా, మిగిలిన ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను ప్రథమ చికిత్స నిమిత్తం సాలూరు సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ జ్ఞానప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పలకలు అమర్చండి



పలకలు తొలగించిన కాలువ

బొబ్బిలి: పట్టణంలోని రైల్వే స్టేషన్ జంక్షన్‌లో విజయలక్ష్మి మెస్ వద్ద కాలువపై పలకలు తీసి చాలా రోజులవుతోంది. కాలువలో మురుగు నీరు ఎక్కువగా ఉంది. దీనిని తొలగించి పలకలు అమర్చాల్సి ఉంది. ప్రధాన కూడలి కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఒకరిద్దరు ఈ కాల్వ వద్ద పడి గాయాలపాలయ్యారు. త్వరగా కాలువను శుభ్రం చేసి పలకలు అమర్చాలని స్థానికులు కోరుతున్నారు.

మార్కెట్ ఆశీల వేలం మరోసారి వాయిదా..



షీల్డ్ టెండర్లు సమర్పించిన కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్న కమిషనర్

రాజాం సిటీ: పట్టణంలోని మార్కెట్‌లో ఆశీల వసూళ్లకు సంబంధించి నిర్వహించిన వేలం ఎవరి పోకడవారిదే అన్నచందంగా మారింది. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం షీల్డ్ టెండర్ ప్రక్రియ నిర్వహించారు. ఈ టెండర్లో జీఎస్టీతో కలిపి రూ.28.50 లక్షలకు మాత్రమే అధికంగా కోట్ చేశారని కమిషనర్ జె.రామఅప్పలనాయుడు తెలిపారు. అయితే ఈ టెండర్ కూడా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జీఎస్టీతో పాటు అధికారులు నిర్ణయించిన సుమారు రూ. 41 లక్షల కంటే తక్కువగా ఉందని, దీనిని ప్రత్యేకాధికారి దృష్టికి తీసుకువెళ్తామని కమిషనర్ తెలిపారు. బహిరంగంగా అయితే ఎవరూ ముందుకు రావడంలేదని, షీల్డ్ టెండర్లు వేసినా ఉపయోగంలేకపోయిందని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రత్యేకాధికారి సూచనలతో ఈ నెల 13న మరోసారి షీల్డ్ టెండర్లు వేయనున్నామని కమిషనర్ తెలిపారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు



బొబ్బిలి: బోరు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

• ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి లేకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని జగన్నాథపురంలో కొత్తగా వేసిన తాగునీటి బోరును మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ శంబంగి లక్ష్మీ వేణుగోపాలనాయుడు, జడ్పీటీసీ శాంతకుమారి, ఎంపీడీఓ రవికుమార్, సర్పంచ్ బొద్దల పద్మ, తదితరులు పాల్గొన్నారు.

క్రాస్ ప్రోగ్రాం ప్రారంభం

తెర్లాం: వేసవిని దృష్టిలో ఉంచుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం క్రాస్ ప్రోగ్రాం వాహనాన్ని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. పాడైన తాగునీటి బోర్లకు మరమ్మతులు చేపట్టి ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు క్రాస్‌ప్రోగ్రాం అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ ఏఓ డీవీ అప్పారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు, బోర్ మెకానిక్‌లు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేగిడి: వేసవిలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5 లక్షలతో కొనుగోలు చేసిన బోరు పరికరాలను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీల వారీగా సిబ్బందికి పంపిణీ చేశారు. ఎంపీడీఓ శ్యామలాకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్, ఏఓ నాగమణి, బోరు మెకానిక్‌లు పాల్గొన్నారు.

బోరు మరమ్మత్తులు

సంతకవిటి: మండలంలోని వాసుదేవపట్నం పంచాయతీ పోతులజగ్గుపేట గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వద్ద ఉన్న తాగునీటి బోరు పాడవడంతో క్రాస్‌ప్రోగ్రాం కింద మెకానిక్‌లు త్రినాథ్, కృష్ణమూర్తి, మన్మథరావు మంగళవారం బాగుచేశారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



రామభద్రపురం: ఆరోగ్య సురక్ష కిట్లు అందజేస్తున్న డాక్టర్ శిరీష, నాయకులు



బొబ్బిలి: దిబ్బగుడ్డివలసలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం

రామభద్రపురం: ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని ఎంపీడీఓ సీహెచ్ ఈశ్వరమ్మ అన్నారు. మండలంలోని రొంపల్లి సచివాలయం పరిధిలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆమె పరిశీలించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఏఎల్‌జీ శిరీష, వైద్య బృందం రోగులకు రక్తపరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు. ఆపరేషన్ అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వెంకటరమణ, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బిలి: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు గ్రామస్థాయిలోనే మెరుగైన ఆరోగ్య సేవలు అందుతున్నాయని ఎంపీడీఓ పి.రవికుమార్ అన్నారు. మండలంలోని దిబ్బగుడ్డివలసలో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలించి అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు. వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద టూవీలర్ నిర్వహణపై మెకానిక్‌లకు శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఏపీ స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్, జిల్లా కలెక్టర్ నీతిఅయోగ్ సంయుక్తంగా 30 రోజుల పాటు ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్కిల్ హబ్ మేనేజర్ గోవిందరావు తెలిపారు. శిక్షణ అనంతరం బ్యాంకు లింకేజీ ద్వారా జీవనోపాధికి రాయితీపై రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రాజెక్టు మేనేజర్ బొత్స గురునాయుడు, కె.రవికిరణ్, ట్రైనర్ కె.గురుమూర్తి, ప్రాజెక్టు కోఆర్డినేటర్ గణపతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా స్కిల్‌హబ్ అధికారి గోవిందరావు

ఉపాధి పనుల పరిశీలన



సంతకవిటి: మస్టర్లు పరిశీలిస్తున్న ఏపీడీ ఎం.శ్రీనివాసరావు



వంగర: ఎం.సీతారాంపురంలో పనులు పరిశీలిస్తున్న ఏపీఓ

సంతకవిటి: బొద్దూరు గ్రామంలోని కొత్త చెరువులో జరుగుతున్న ఉపాధి హామి పనులను ఏపీడీ ఎం.శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. వేతనదారుల మస్టర్లు తనిఖీ చేసి వారితో మాట్లాడారు. రెండు పూటలా పనులు చేయాలని, కొలతల ప్రకారం పనిచేస్తే రూ.272 వేతనం అందుతుందన్నారు. ఆయన వెంట ఏపీఓ హరనాథ్, ఫీల్డ్ అసిస్టెంట్ హైమావతి, టీఏలు సతీష్, శ్రీనివాస్ ఉన్నారు.

వంగర: ఉపాధిహామీ పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ మర్రాపు సత్యవతి అన్నారు. మండలంలోని ఎం.సీతారాంపురంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను మంగళవారం పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసల నివారణకు ప్రభుత్వం ఉపాధిహామీ పథకం కింద పనులు కల్పిస్తోందని, జాబ్‌కార్డు ఉన్న వేతనదారులంతా పనుల్లో పాల్గొనాలని సూచించారు. మండలంలోని 26 పంచాయతీల్లో 2800 మంది వేతనదారులు ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీఏ భారతి, ఎఫ్ఏ కాంబోతుల వాసు ఉన్నారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధం



సిద్ధం కిట్లు అందజేస్తున్న తలే రాజేష్, తదితరులు

రాజాం: సార్వత్రిక ఎన్నికలు ఎప్పుడొచ్చినా మేం సిద్ధంగానే ఉన్నామని, పార్టీ కార్యకర్తలు, అభిమానులు కూడా సిద్ధంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ రాజాం ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ పిలుపునిచ్చారు. మండలంలో కంచరాం గ్రామంలో పార్టీ కార్యకర్తలకు మంగళవారం సిద్ధం కిట్లు అందజేశారు. బూత్ కమిటీలతో సమీక్షించారు. కార్యక్రమంలో పార్టీ రాజాం రూరల్ అధ్యక్షులు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, యూత్ అధ్యక్షులు గెద్దాపు అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, ఎంపీటీసీ రాంబాబు, జేసీఎస్ కన్వీనర్ కామోదుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాలువల మరమ్మతులు

రాజాం: మండలంలో పెనుబాక పంచాయతీలో 15వ ఆర్థిక సంఘ నిధులతో డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరిస్తున్నారు. పలుచోట్ల అర్ధాంతరంగా ఉండిపోయిన కాలువలు బాగుచేయడంతో పాటు మరమ్మతులకు గురైనచోట్ల బాగుచేసేందుకు ఎస్టిమేషన్లు వేయించినట్లు జెడ్పీటీసీ బండి నర్సింహులు మంగళవారం తెలిపారు. గ్రామంలోని కాలువలన్నింటినీ పునరుద్ధరించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు.

కోర్టు పరిధిలో ఉన్న చెట్లు నరికివేత

సంతకవిటి: కోర్టు పరిధిలోని చెట్లు నరికివేతను పోలీసులు మంగళవారం అడ్డుకొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తాలాడ సమీపంలో ఇండి ట్రేడ్ ఆఫీస్ ఏర్పాటు చేసి షేర్ మార్కెట్ ముసుగులో అనేక మందిని మోసం చేయడంతో గతంలో ఈ సంస్థకు చెందిన ఆస్తులన్నీ కూడా కోర్టు పరిధిలో ఉన్నాయని తెలిపారు. ఇందులో భాగంగా ఇండి ట్రేడ్ ఆఫీస్ పక్కన ఉన్న 24 ఎకరాల నీలగిరి తోటలోని చెట్లను గుట్టుచప్పుడు కాకుండా పొగిరి, ఎచ్చెర్ల మండలం ఎస్.ఎస్.ఆర్‌పురం గ్రామాలకు చెందిన కూలీలు నరికి వేస్తుండడం తెలుసుకున్న రాజాం సీఐ శ్రీనివాసరావు, సంతకవిటి పోలీస్ సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని చెట్లు కొట్టడాన్ని నిలుపుదల చేశారు. అప్పటికే నరికిన చెట్లను స్వాధీనం చేసుకున్నారు. లైదాం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ద్వారా ఇక్కడకు వచ్చామని కూలీలు పోలీసులకు చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ వాసుదేవరావు తెలిపారు.

మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్ట్

వంగర: మండలంలోని మద్దువలస జంక్షన్ వద్ద అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై వై.వి.జనార్దన్ మంగళవారం తెలిపారు. ఆ వ్యక్తి వద్ద 11 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.